నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 28 డిసెంబర్ 2024 | NIZAMABAD

## రేపు ఇందూరుకు ఎమ్మెల్సీ కవిత

- ఘన స్వాగతం పలుకనున్న గులాబీ శ్రేణులు
- డిచ్‌పల్లి నుంచి సుభాష్‌నగర్ వరకు భారీ ర్యాలీ
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి



ఖలీల్‌వాడి, డిసెంబర్ 27: ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత రేపు (ఆదివారం) జిల్లాకు రానున్నారు. ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు గులాబీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. కేంద్రంలోని బీజేపీ అక్రమ కేసులతో ఎన్ని నిర్బంధాలకు గురిచేసినా మొక్కవోని ధైర్యంతో ప్రజాక్షేత్రంలో పోరాడుతున్న ఎమ్మెల్సీ కవిత ఆదివారం జిల్లాకు రానున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి నిజామాబాద్‌కు చేరకుంటారని, డిచ్‌పల్లి వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలుకుతారన్నారు. అనంతరం బైపాస్ రోడ్డు మీదుగా సుభాష్‌నగర్ ఎస్ఎఫ్ఎస్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కవితకు ఘన స్వాగతం పలికేందుకు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఎస్ సర్కిల్ వద్దనున్న తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్సీ కవిత పుష్పాంజలి ఘటించనున్నారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఆమె ప్రసంగిస్తారని జీవన్‌రెడ్డి తెలిపారు.

## దేశాభివృద్ధిలో మన్మోహన్‌ది కీలక పాత్ర

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, డిసెంబర్ 27: భారత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆర్థిక వేత్తగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధానిగా దేశాభివృద్ధిలో పాత్రుడయ్యారని, వివిధ హోదాల్లో దేశం కోసం ఆయన చేసిన సేవలు ఎనలేనివని ఓ ప్రకటనలో కొనియాడారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేసి, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని పేర్కొన్నారు. ప్రధానిగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.



మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను సత్కరించిన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

## పేదలకు అండగా నిలిచిన కేసీఆర్

- సొంతింటి కల తీర్చిన బీఆర్ఎస్ అధినేత
- కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూరు, డిసెంబర్ 27: పేద కుటుంబాలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అండగా నిలిచారని, డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి పేదల సొంతింటి కల నెరవేర్చాని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో బుధవారం గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించగా, గంప గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతో కాసేపు మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు.

## వేతనాల కోసం జీపీ కార్మికుల నిరసన

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్



బిచ్కుంద మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న పంచాయతీ కార్మికులు

బిచ్కుంద/ఏర్గట్ల, డిసెంబర్ 27: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బిచ్కుంద, ఏర్గట్ల తదితర మండలాల్లో గ్రామపంచాయతీ కార్మికులు, సిబ్బంది శుక్రవారం నిరసన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయాల ఎదుట బైఠాయించి టోకెన్ సమ్మె నిర్వహించారు. ఎన్నికల ముందర కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించక పోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఐ కామారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్ గొండ, జీపీ కార్మికుల సంఘం ప్రతినిధులు రూప్‌సింగ్, సాయిలు, భూమయ్య, లక్ష్మణ్, గంగవ్వ, చంద్రవ్వ, శకుంతల, మారుతి, సాయిరాం, హన్మాండ్లు, రఫిక్, రాకేశ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



### విభిన్న కోణాల్లో దర్యాప్తు

రామారెడ్డి, డిసెంబర్ 27: ముగ్గురి మృతి కేసులో పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మహిళా కానిస్టేబుల్ శ్రుతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదాశివనగర్ పోలీసులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) 194 కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు అధికారిగా సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్‌ను ఎస్పీ సింధూశర్మ నియమించారు. సీఐ సంతోష్‌కుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగి వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించింది. విచారణ ప్రాథమిక దశలో ఉన్నదని, ఇప్పుడే ఎలాంటి వివరాలు చెప్పలేమని ఎస్సై రంజిత్ తెలిపారు.

**రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎస్సై, కానిస్టేబుల్, ఆపరేటర్ మృతి కేసులో చిక్కుముడులు వీడడం లేదు.** ఆ ముగ్గురి మరణాలకు కారణాలేమిన్నటది అంతుచిక్కడం లేదు. నిందితులు, దోషులే లేని ఈ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. ఏ నేరం జరిగినా గంటల్లో వాస్తవాలు తేల్చేస్తున్న పోలీసులకు ఈ ఉదంతం సవాల్ విసిరింది. బీబీపేట కానిస్టేబుల్ శ్రుతి కేంద్రబిందువుగా సాగిన ఈ వ్యవహారంలో ఏం జరిగిందనేది ఇప్పటికీ మిస్టరీగా మిగిలింది. విభిన్న కోణాల్లో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కేసు వివరాలు ఏమాత్రం వెల్లడించడం లేదు. ఫోరెన్సిక్, మృతుల కాల్‌డాటా విశ్లేషిస్తున్న అధికారులు.. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే స్పష్టత వస్తుందని చెబుతున్నారు. అప్పటిదాకా ఈ సస్పెన్స్ కొనసాగనున్నది.

నిజామాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ముగ్గురి చుట్టూ అల్లుకున్న చిక్కుముడులు



ఎస్సై సాయికుమార్ (ఫైల్)



నిఖిల్ (ఫైల్)



కానిస్టేబుల్ శ్రుతి (ఫైల్)

# దోషులే లేని కేసు!

- నిందితులు వారే.. బాధితులూ వారే?
- పోలీసులకు సవాల్‌గా మారిన కేసు
- పెద్ద చెరువు ఘటనలో అంతు చిక్కని ప్రశ్నలెన్నో
- ఎస్సై, కానిస్టేబుల్, ఆపరేటర్ మధ్య సంబంధమేమిటి?
- కాల్ డాటాను విశ్లేషిస్తున్న పోలీసులు
- ఫోరెన్సిక్, పోస్ట్‌మార్టం నివేదిక అనంతరమే స్పష్టత
- దర్యాప్తు అధికారిగా సదాశివనగర్ సీఐ

**భిక్కనూర్** ఎస్సై సాయికుమార్, బీబీపేట మహిళా కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సొసైటీ తాత్కాలిక ఉద్యోగి నిఖిల్ మరణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్, సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు వివిధ కోణాల్లో వివరాల సేకరణకు యత్నిస్తున్నారు. ఇప్పటికే మృతుల ఫోన్ కాల్ డాటా విశ్లేషణ, వాట్సాప్ చాటింగ్‌పై దృష్టి సారించిన పోలీసులు.. ఆ ముగ్గురికి ఎలా పరిచయం, వారి మధ్య ఉన్న సంబంధం తదితర వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వారు చనిపోయిన రోజు ఎక్కడ, ఎప్పుడు కలిశారో గుర్తించేందుకు సీసీ కెమెరా పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. పోలీసు శాఖకే చెందిన ఇద్దరు అనుమానాస్పదంగా చనిపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసును త్వరగా కొలిక్కి తెచ్చేందుకు యత్నిస్తున్నారు. డీజీపీ జితేందర్ ఎస్పీ సింధూ శర్మకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీసినట్లు తెలిసింది.

**రిపోర్టులు వస్తేనే..**

బుధవారం మధ్యాహ్నం తర్వాత అదృశ్యమైన ఎస్సై, కానిస్టేబుల్, ఆపరేటర్ అడ్లూర్ఎల్లారెడ్డి చెరువులో విగత జీవులుగా తేలారు. అనేక సందేహాలు వెంటాడుతున్న ఈ కేసులో శవపరీక్ష, ఫోరెన్సిక్ నివేదిక కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు. ఆలోపు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మృతుల కాల్‌డాటాను విశ్లేషించడంపై దృష్టి పెట్టారు. ముగ్గురి మధ్య జరిగిన ఫోన్‌కాల్స్, వాట్సాప్ చాటింగ్‌తో పాటు ఫొటోలు, వీడియోలను సేకరించనున్నారు. తద్వారా ఈ ముగ్గురిలో ఎవరెవరికి ఎలాంటి సంబంధం ఉందో తెలుతుందని భావిస్తున్నారు. బీబీపేట పోలీస్ స్టేషన్‌లోనే ఎస్సై సాయికుమార్‌కుచ మహిళా కానిస్టేబుల్ శ్రుతికి పరిచయం ఏర్పడింది. ఇది కాస్త స్నేహంగా మారిందన్న విషయాన్ని పోలీసులు నిర్ధారించారు. శ్రుతికి, మరో మృతుడు నిఖిల్‌కు మధ్య ఉన్న సంబంధం ఏమిటన్న దానిపై ఇప్పుడు దృష్టి పెట్టారు. నిఖిల్‌కు, శ్రుతికి ఎలా పరిచయం ఏర్పడింది? ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఇందుకోసం బీబీపేట పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు మృతుల కుటుంబ సభ్యులు, వారి స్నేహితులను విచారించాలని యోచిస్తున్నారు. పోస్ట్‌మార్టం, ఫోరెన్సిక్ నివేదికలు వస్తేనే ఈ కేసు ఓ కొలిక్కి రానున్నది. మృతులంతా నీళ్లలో మునిగి పోయారా? లేదా ఎవరైనా ముంచేశారా? అని రిపోర్టుల్లో వెల్లడి కానున్నది. ఎవరైనా బలవంతంగా నీళ్లలో తోసేసినా నివేదికలో బయటకొచ్చే అవకాశమున్నదని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. మనిషి శరీరంలోకి నీళ్లు చొచ్చుకెళ్లే విధానం ప్రకారం ఆత్మహత్య, హత్యను నిపుణులు నిర్ధారిస్తారని దర్యాప్తుతో సంబంధం ఉన్న పోలీసు అధికారులు తెలిపారు.

### వాస్తవాలేమిటి..?

అత్యంత సంక్లిష్టంగా మారిన ముగ్గురి మృతి కేసులో ఇతరుల ప్రమేయమేమీ లేదని పోలీసులు ఇప్పటికే తేల్చి చెప్పారు. అయితే, చనిపోవడానికి ముందు ముగ్గురు ఎక్కడ కలిశారు.. పెద్ద చెరువు వద్దకు ఎవరి ప్రోద్బలంతో వచ్చారు. శ్రుతి, నిఖిల్‌కు చెందిన ద్విచక్ర వాహనాలు ఎక్కడున్నాయనే దానిపై దృష్టి సారించారు. మరోవైపు, పోలీసుల నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఇద్దరిని ఎక్కడో హత్య చేసి, ఆ మృతదేహాలను తీసుకొచ్చి చెరువులో పడేసి ఉంటారని, ఆ తర్వాత ఆత్మహత్య చేసుకుని ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### మూడు కుటుంబాల్లో విషాదం..

ములుగు జిల్లా వాజేడు ఎస్సై తన రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువక ముందే కామారెడ్డి జిల్లాలో ఓ ఎస్సై, మరో మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పదంగా మరణించడం పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. మొత్తానికి ఈ ఘటనతో మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. శ్రుతిపై ఆధారపడిన కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. ఎస్సై సాయికుమార్ మరణించడంతో ఆయన భార్య, కుమారుడు పెద్ద దిక్కును కోల్పోయారు. పెళ్లీడుకొచ్చిన నిఖిల్ సైతం అర్ధాంతరంగా తనువు చాలించడంతో అతని కుటుంబంలో కూడా విషాదం నెలకొంది. చనిపోయిన ముగ్గురు వ్యక్తులే బాధితులు, నిందితులు కావడం, దోషులను గుర్తించలేని కేసుగా మారిన తరుణంలో పోలీసుల దర్యాప్తు ఆసక్తికరంగా మారింది.

### అనుమానాలు ఎన్నో..

ఏ కేసులోనైనా నిందితులు, బాధితులు ఉండడం సాధారణం. కానీ విచిత్రంగా ముగ్గురి మృతి కేసులో నిందితులు, బాధితులు మృతులే కావడం విశేషం. ఈ అంశమే ఇప్పుడు పోలీసులకు సవాల్‌గా మారింది. ముగ్గురిలో ఎవరో ఒకరు బతికినా ఏం జరిగిందో వెల్లడయ్యేది. కానీ అందరూ మృతి చెందడం, చనిపోయిన వారితో మిగతా వారికి ఎలాంటి సాన్నిహిత్యం లేకపోవడం, మృతుల్లో ఎవరెవరికి ఏ సంబంధమున్నదో తెలియక పోవడంతో ఈ కేసు మిస్టరీగా మారింది. శ్రుతి కేంద్రంగా అల్లుకున్న ఈ పరిచయ పర్వంలో ఎవరు నిందితులు.. ఎవరు బాధితులు? అన్నది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. మరోవైపు, మృతుల కుటుంబాల నుంచి వస్తున్న స్పందన భిన్నంగా ఉండడం కూడా అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఆత్మహత్య చేసుకునేంత పిరికి అమ్మాయి కాదని శ్రుతి సంబంధీకులు చెబుతున్నారు. ముమ్మాటికీ ఇది హత్యే అని వారు వాదిస్తున్నారు. మరోవైపు, ఎస్సై సాయికుమార్ బంధువుల వాదన మరోలా ఉంది. బంగారం లాంటి భవిష్యత్తు ఉన్న ఎస్సైకి ఆత్మహత్య చేసుకునే అవసరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇవి ఆత్మహత్యలా.. లేక ఇద్దరిని హత్య చేసి మరొకరు ఆత్మహత్య చేసుకున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## భిక్షాటన చేసి.. బసవన్నకు విన్నవించి..

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన
- కామారెడ్డిలో భిక్షాటన చేసిన సిబ్బంది..
- నిజామాబాద్‌లో బసవన్నకు వినతిపత్రం



నిజామాబాద్‌లో బసవన్నకు వినతిపత్రం సమర్పిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

కామారెడ్డి/కంఠేశ్వర్, డిసెంబర్ 27: డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టిన సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు వినూత్నంగా నిరసన చేపడుతున్నారు. రోజుకో రీతిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కామారెడ్డిలో సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు బుధవారం భిక్షాటన చేస్తూ ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. అలాగే నిజామాబాద్‌లో బసవన్నకు వినతిపత్రం సమర్పించి ప్రభుత్వం తమ మొర ఆలకించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏండ్లుగా పని చేస్తున్నా తమకు కనీస వేతనాలు లేవని వాపోయారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమ్మెతో కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, భవిత సెంటర్లలో విద్యాబోధన నిలిచిపోయిందని, అయినా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటున్నట్లు రాష్ట్రంలో ఉన్నది ప్రజాపాలన అయితే తమ సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఉద్యోగులను రోడ్డు పైకి తీసుకొచ్చిన ప్రభుత్వ మొండి వైఖరి మారాలని, అధికారంలోకి రాగానే రెగ్యులరైజ్ చేస్తామన్న మాటను రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దలు ఇకనైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



కామారెడ్డిలో భిక్షాటన చేస్తూ నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు